# సాక్షి
## అన్నమయ్య జిల్లా

ఆదివారం । 19 । మే । 2024




**భక్తజనసంద్రం.. బ్రహ్మరథోత్సవం**

అశేష జన వాహిని మధ్య శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -8లో



**అప్రమత్తతతో ప్రమాదాలకు చెక్**

నిత్య జీవితంలో విద్యుత్తు అవసరం. వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడాల్సిందేనని విద్యుత్తు అధికారులు హెచ్చరిస్తున్నారు. -8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.220 | రూ.280 |
| రెండోరకం | రూ.130 | రూ.210 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 410 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 485 | 485 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 145.840 కిలోలు

## న్యూస్‌రీల్

### జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల కారణంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఆకాశమంతా మేఘావృతమైంది. ప్రస్తుతం ఉపరితల ద్రోణి ఆవర్తనంతో వర్షాలు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది.

### నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అలవలపాటి ముకుందారెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన పథకానికి శనివారం రూ.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.దువ్వూరు మండలం పెద్ద భాకరాపురానికి చెందిన ఉమ్మడి ఆంజనేయులు, ఆయన సతీమణి వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు విరాళం అదజేశారని చెప్పారు.ఈసందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ దాతలకు తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామి వారి చిత్రపటం అందించారు. వారిని శేషవస్త్రంతో సత్కరించారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

### స్కేటింగ్‌లో ధ్రుతికి పతకం



తండ్రి శివక్రిష్ణారెడ్డితో ధ్రుతి

కలసపాడు: మండలంలోని దిగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన పల్లెశివక్రిష్ణారెడ్డి, పావనిల కుమార్తె పల్లె ధ్రుతికి జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్‌లో అండర్–7, అండర్–9లలో ద్వితీయ స్థానం లభించింది. ధ్రుతి చిన్నప్పటి నుండి స్కేటింగ్‌లో ఆసక్తి చూపడంతో అనంతపురం జిల్లాలో గ్రామీణ నీటిపారుదలశాఖలో ఏఈగా పనిచేస్తున్న తండ్రి శివక్రిష్ణారెడ్డి ప్రోత్సహించారు. ఈ క్రమంలో తాలూకా, డివిజన్ స్థాయిలో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని పలు ర్యాంకులు సాధించింది. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన ఏపీ రోలర్ స్కేటింగ్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికై ంది. ప్రస్తుతం గోవాలో వివిధ కేటగిరీలలో మూడు రోజులుగా జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్‌లో ధ్రుతి ద్వితీయ స్థానం సాధించింది. నిర్వాహకులు మెడల్‌ను అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ధృతికి అభినందనలు తెలిపారు.

# ఉజ్వల భవితకు ఐటీఐ

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సు పూర్తికాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- స్వల్పకాలిక వ్యవధిలోనే స్థిరపడుతున్న విద్యార్థులు
- అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల



తంబళ్లపల్లెలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రయోగం చేస్తున్న విద్యార్థులు



తంబళ్లపల్లెలోని ప్రభుత్వ ఐటీఐ

మదనపల్లె సిటీ: యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి ఐటీఐలు. కావాల్సినంత భరోసానిస్తూ బంగారు భవితకు బాటలు పరుస్తున్నాయి. ఐటీఐలలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెలకువలపై పట్టు సాధిస్తుండటంతో కోర్సు పూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వల్పకాలిక వ్యవధిలోనే జీవితాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు.

**ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు:**

జిల్లాలో పలు ఐటీఐలు సంప్రదాయ కోర్సులతో పాటు ఒక్కో కోర్సుకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నాయి. జిల్లా ప్రభుత్వ ఐటీఐలో టర్నర్, మెషనిస్టు, ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సు లు చేసిన పలువురు విద్యార్థులు ప్రముఖ సంస్థలైన బీహెచ్‌ఈఎల్, అమరరాజా, బీఈఎల్, ఐటీసీఎల్ వంటి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు:**

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటీస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కటి మార్గంగా ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుంది. ఇదిలా ఉంటే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ, ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ కూడా ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధి సైతం ఐటీఐ కోర్సు ఎంతో దోహదం చేస్తుంది.



జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు : **3**

తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట

ప్రభుత్వ ఐటీఐలో ఖాళీలు: **392**

ప్రైవేటు ఐటీఐలు: **12**

ప్రైవేటు ఐటీఐలో ఖాళీలు: **1064**

**కోర్సుల వివరాలు ఇలా..**

ప్రభుత్వ,ప్రైవేటు ఐటీఐలలో ఏడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన పలు కోర్సులు ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, టర్నర్, మిషనిస్టు కోర్సులు ఉన్నాయి. ఏడాదికి సంబంధించి కంప్యూటర్ కోర్సు(కోప), డీజిల్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్ కోర్సులు ఉన్నాయి.

**ఉన్నత చదువులకు అవకాశం**

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు బీటెక్‌లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటర్ ఎంట్రీని పొంది ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**



ఐటీఐలో చేరదలిచే విద్యార్థులు జూన్ 10వతేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థులకు మొబైల్ నంబర్‌కు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి. –శ్రీనివాసరావు, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల జిల్లా కన్వీనర్

**ఉజ్వల భవిత అందించడమే లక్ష్యం**



ఐటీఐలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిత అందించాలన్నదే మా ప్రధాన సంకల్పం. ట్రేడ్‌ల పాఠాలతో పాటు భావవ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. – శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్, టీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ ఐటీఐ, తంబళ్లపల్లె

### వంద శాతం టీకాల లక్ష్యాన్ని చేరుకోవాలి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఎస్ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డి

రాయచోటి అర్బన్: వంద శాతం టీకాల లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణ అధికారి(డీపీఎంఓ) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. శనివారం పట్టణంలోకి కొత్తపల్లె పీహెచ్‌సీ పరిధిలోని రెడ్డీస్ కాలనీ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని ఆయన డీఎస్ఎంఓ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారుల జాబితా ప్రకారం వారికి ముందస్తుగా సమాచారం అందించి వారు కచ్చితంగా టీకాలు వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. శిశువుల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గురించి తల్లులను అడిగి తెలుసుకోవాలన్నారు. అవసరమైతే వారికి పరీక్షలు నిర్వహించాలన్నారు. మరీ అవసరమనుకుంటే ఏరియా ఆసుపత్రిలోని చిన్నపిల్లల నిపుణుల దగ్గరకు తీసుకెళ్లి వైద్యం అందించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

### 20 నుంచి జేవీవీ వేసవి శిక్షణా శిబిరం

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రత్యేకంగా ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడీ దేవదత్తం తెలిపారు. శనివారం రామకృష్ణనగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శిబిరం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞానదాయకమైన శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

## రాజోలికి జలకళ



రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న నీరు

పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు వచ్చి చేరుతోంది. ఆనకట్ట నుంచి కుందూనదిలో 862 క్యూసెక్కులు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. 20 రోజుల కిందట అవుకు రిజర్వాయర్ నుంచి పాలేరు వాగు ద్వారా రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదికి నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి కుందూ నదిలో నీరు అరకొరగా ప్రవహిస్తోంది. ఆ నీటితో పశువులు, మేకలు, గొర్రెలకు తాగునీటి అవసరాలు తీరాయని రైతులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం నీటితో శనివారం రాజోలి ఆనకట్ట నుంచి కుందూ నదిలోకి నీరు పోవడంతో జలకళ సంతరించుకుంది. –రాజుపాళెం

## ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు ఇప్పటికే జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 1 నుంచి 6 వరకు ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఉండదు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చెలరేగిన ఘర్షణల్లో అనేక మంది ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘర్షణలకు బాధ్యులను చేస్తూ పలువురు పోలీసు అధికారులపై వేటు పడింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అవసరమైతే రాజకీయ నేతల గృహ నిర్బంధాలు, జిల్లా బహిష్కరణ అమలుకు పోలీసు అధికారులు సిద్ధమవుతున్నారు.. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసే అవకాశం లేకపోలేదు.

**144 సెక్షన్ అమలు**

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు వీలుగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కౌంటింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను మూడంచెల భద్రత మధ్య భద్రపరిచారు. ప్రత్యేక బలగాలతో 24 గంటల పాటు నిఘా కొనసాగుతోంది. జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ శాంతియుతంగా సాగేందుకు కౌంటింగ్ కేంద్రానికి 200 మీటర్ల రేడియస్‌లో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లోని 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే ఐపీసీ సెక్షన్ 188 నిబంధనల ప్రకారం శిక్షార్హులవుతారు.

# ఆట.. సరికొత్త బాట



ప్రారంభమైన ఆస్ట్రోటర్ఫ్ కోర్టు పనులు




నిర్మాణంలో ఉన్న గ్యాలరీ

**జాతీయక్రీడ హాకీకి జవసత్వాలు కల్పించడమే లక్ష్యంగా కడపలోని డీఎస్ఏ క్రీడామైదానంలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో వాటర్ బేస్డ్ ఆస్ట్రోటర్ఫ్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా రూ.8 కోట్ల నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. మైదానం అందుబాటులోకి వస్తే జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉంది.**

- కడప గడపలో అంతర్జాతీయస్థాయి హాకీ మైదానం
- రూ.8కోట్ల నిధులతో ప్రారంభమైన పనులు
- మూడునెలల్లో పూర్తిచేయడమే లక్ష్యంగా వేగవంతం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికారసంస్థ మైదానంలో ఫెడరేషన్ ఆఫ్ హాకీ ఇండియా మార్గదర్శకాల మేరకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వాటర్ బేస్డ్ ఆస్ట్రో టర్ఫ్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.8 కోట్ల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో మైదానం ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో హాకీ క్రీడకు ఎనలేని ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో సైతం రాణించిన వారు ఉన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థానాల్లో ఉన్న క్రీడాకారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా ఆస్ట్రో టర్ఫ్ ఏర్పాటు చేయాలన్న క్రీడాకారుల కోరిక ఎట్టకేలకు ఫలించబోతోంది. ఇందులో భాగంగా ఇటీవలే పనులు ప్రారంభించడంతో పాటు అక్టోబర్ నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యంతో వేగవంతం చేశారు. ఇందులో భాగంగా 101 మీటర్ల పొడవు, 61 మీటర్ల వెడల్పుతో టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అనుబంధంగా మ్యాచ్‌లను వీక్షించేందుకు గ్యాలరీని నిర్మిస్తున్నారు. టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా జాతీయస్థాయి మ్యాచ్‌ల నిర్వహణతో పాటు ఇక్కడ సాధన చేసే క్రీడాకారులు జాతీయ స్థాయి, అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌ల్లో రాణించేందుకు వీలవుతుంది. ఇప్పటి వరకు సాధారణ కోర్టుల్లో ఆడుతున్న క్రీడాకారులు ఒక్కసారిగా జాతీయస్థాయిలో టర్ఫ్‌కోర్టులో ఆడాల్సి రావడం కాస్త ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో కడప గడపలో ఆస్ట్రోటర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయడం క్రీడాకారుల్లో సరికొత్త జోష్ నింపింది. ఇప్పటి వరకు మన రాష్ట్రంలో కేవలం రెండు మాత్రమే ఆస్ట్రోటర్ఫ్ కోర్టులు ఉండగా, తాజాగా కడప గడపలో ఏర్పాటు చేస్తుండటం పట్ల హాకీ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా హాకీ క్రీడామైదానం ఏర్పాటు చేయడాన్ని క్రీడాకారులు స్వాగతిస్తుండటంతో పాటు ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర ఇతర క్రీడలకు స్థలం కేటాయింపుతో పాటు ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



కడప డీఎస్ఏ మైదానంలో ఏర్పాటు చేయనున్న మైదానం ప్లాన్

**ఇండియాకు ఆడే అవకాశం లభిస్తుంది**



కడప స్టేడియంలో ఆస్ట్రో టర్ఫ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. మేము సాధన చేసే సమయంలో టర్ఫ్ కోర్టు లేకపోవడం కొంత లోటుగా ఉన్నా, ఉన్నంతలో రాణిస్తూ వచ్చాం. టర్ఫ్ కోర్టు ఉండి ఉంటే ఇండియా జట్టుకు ప్రాతినిథ్యం వహించేవాళ్లం. టర్ఫ్ ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా నుంచి క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించగలరు. – కుమార్‌బాబు, కడప హాకీ క్రీడాకారుడు, సాయ్, చెన్నై

**అదృష్టంగా భావిస్తున్నాం**



కడపలో ఆస్ట్రోటర్ఫ్ ఏర్పాటు చేయడం క్రీడాకారులకు లభించిన అదృష్టంగా భావిస్తున్నాం. టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా పెద్దపెద్ద క్యాంపులు వచ్చే అవకాశం ఉంది. తద్వారా ఉత్తమశ్రేణి హాకీ ఆడేందుకు అవకాశం లభిస్తుంది. భవిష్యత్తు తరాల వారికి ఈ టర్ఫ్ మైదానం ఒక వరంగా ఉపయోగపడుతుంది. అధికారులు, ప్రభుత్వానికి ధన్యవాదాలు. – వేణుమాధవరెడ్డి, కడప హాకీ క్రీడాకారుడు, సాయ్, హైదరాబాద్

# హెచ్‌ఐవీ బాధితులకు అండ.!

- కౌన్సెలింగ్‌తో మనోధైర్యం
- ఉచితంగా మందులు పంపిణీ




తంబళ్లపల్లెలోని ఐసీటీసీ కేంద్రం

మదనపల్లె సిటీ: హెచ్‌ఐవీ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వ్యాధి నివారణకు చర్యలు చేపడుతోంది. వ్యాధిగ్రస్తులకు ఐసీటీసీ కేంద్రాల్లో కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యం కల్పిస్తున్నారు. ప్రతి ఏడాది మే మూడవ ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ సంస్మరణ దినం నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దాం.. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం.. అనే నినాదం ఇచ్చారు. వ్యాధితో మృతి చెందిన వారికి ఆత్మ శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తారు.

- హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారికి ఏఆర్‌టీ (యాంటీ రిట్రోవైరల్) కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఆత్మస్థైర్యాన్ని నింపేలా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన మందులను అందిస్తున్నారు. జిల్లాలో మదనపల్లెలో ఏఆర్‌టీ కేంద్రం ఉంది. దీంతో పాటు రాయచోటి, పీలేరు ఏఆర్‌టీ ప్లస్, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరులలోని ప్రభుత్వ సీహెచ్‌సీలలో లింక్ ఏఆర్‌టీ కేంద్రాలున్నాయి. ఆయా ఐసీటీసీ కేంద్రాల్లో నిర్వహించే రక్తపరీక్షల్లో హెచ్‌ఐవీ పాజిటివ్ ఉందని తేలితే వారికి కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యం నింపుతున్నారు. వారందరిని ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదు చేసి మందులు అందజేస్తారు. నేషనల్ ఎయిడ్స్ ఆర్గనైజేషన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో వ్యాధిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌ఐవీ వచ్చాక బాధపడేకన్నా దాని బారిన పడకుండా చూసుకోవాలని పలు కార్యక్రమాలతో చైతన్యం పెంచుతున్నారు. గతంతో పోలిస్తే బాధితులకు మందులు సకాలంలో అందిస్తుండటంతో ఆరోగ్యం మెరుగవుతోంది. ఏటా పరీక్షల సంఖ్యను పెంచుతూ పాజిటివ్ కేసులను గుర్తిస్తున్నారు. హెచ్‌ఐవీ పాజిటివ్ గల గర్భిణికి ముందుగా పీపీటీసీటీ చికిత్స అందిస్తూ పుట్టబోయే బిడ్డను ఎయిడ్స్ నుంచి కాపాడే ప్రయత్నాలు జిల్లాలో జరుగుతున్నాయి.

**ఐసీటీసీ కేంద్రాలు**

మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, బి.కొత్తకోట,తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు

**ఏఆర్‌టీ కేంద్రం:** మదనపల్లె

**పోషకాహారం:** బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటోంది. వారికి పింఛన్‌తో పాటు పలు సంస్థల సహకారంతో పోషకాహారం అందిస్తున్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**



జిల్లాలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. కళాబృందాల ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాం. బాధితులకు అండగా నిలుస్తున్నాం. వారికి మనోధైర్యం కల్పిస్తున్నాం. ఆదివారం సాయంత్రం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొవ్వొత్తులు వెలిగించి మరణించిన వారి ఆత్మశాంతి కోసం నివాళులు అర్పిస్తాం. –డాక్టర్ శైలజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, రాయచోటి

## క్లుప్తంగా

### దాడి కేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె : రాయితో దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. మండలంలోని దిగువ గాండ్లపల్లెకు చెందిన సుధాకర్(50) ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. గొల్లపల్లి క్రాస్ సీటీఎం రోడ్డులోని రెడ్డప్పనాయుడు కాలనీ వద్ద, అదే గ్రామానికి చెందిన నారే వెంకటరమణ(32) సుధాకర్‌పై రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాధితుని ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు. నిందితుడు నారే వెంకటరమణను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

### పాముకాటుకు ఇద్దరికి అస్వస్థత

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు పాముకాటుకు గురై అస్వస్థతకు గురయ్యారు. మదనపల్లె మండలం టీకులపాళం బరాలపల్లికు చెందిన కళావతి( 35) వ్యవసాయ బోరు వద్ద పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. అదే విధంగా అడ్డగింటివారిపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి (38) పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితులను వెంటనే 108 వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితులు కోలుకుంటున్నారు.

### ఉపాధి కూలీ మృతి

రాజుపాళెం : మండలంలోని టంగుటూరులో ఉపాధి పనులకు వెళ్తూ కిందపడి వేంపల్లె సుబ్బరాయుడు(60) శనివారం మృతి చెందాడు. సుబ్బరాయుడు ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు ట్రాక్టర్ ట్రాలీలో కూర్చుని వెళ్తున్నారు. మార్గ మధ్యంలో ట్రాలీ డోర్‌కు ఉన్న కడ్డీ విరగడంతో ఒరికి సుబ్బరాయుడు కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడికి భార్య మౌలాలమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



భక్తజనసంద్రం..

# బ్రహ్మ రథోత్సవం

అశేష జన వాహిని మధ్య జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల రథోత్సవం కన్నులారా చూసేందుకు వేలాది భక్తులు బ్రహ్మంగారిమఠం తరలిరావడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. 'వీర బ్రహ్మ జై.. గోవిందమాంబ జై' గోవింద నామస్మరణతో వీధులు మారుమ్రోగాయి.


గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి


రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తజనం

- కిటకిటలాడిన బ్రహ్మంగారిమఠం వీధులు
- కమనీయంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- మార్మోగిన 'గోవింద' నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శనివారం గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మరథోత్సవం, ఆరాధన ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఐదో రోజు తెల్లవారు జామున వీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తన కార్యక్రమాల అనంతరం అర్చనామూర్తులను అభిషేకించి అలంకరించారు. ఉదయం గుడి ఉత్సవం కమనీయంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవారిని ఉత్సవ పీఠంపై ఆశీనులను చేసి ఊరేగించారు. ప్రకాశం జిల్లా చీరాలలోని విశ్వబ్రాహ్మ ఇండస్ట్రీస్‌కు చెందిన తుర్లపాటి సాంబశివారావు, ఆయన సతీమణి పద్మావతి ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం మహా నైవేద్యం జరిగింది.

**రథానికి ప్రత్యేక పూజలు**

శనివారం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం కమనీయంగా సాగింది. ముందుగా మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్య స్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, వరదరాజస్వామితోపాటు కుటుంబ సభ్యులు, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతులు వీరశివకుమారస్వామి, మఠం పెద్దాచార్యులు భద్రయ్యస్వామి, దేవస్థానం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, ఎంపీడీఓ మల్లేశ్వరప్ప రథానికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితు మంత్రోచ్చరణ మధ్య స్వామి, అమ్మవారిని రథంపై కొలువుంచారు. 5.50 గంటలకు రథాన్ని కదిలించగా.. 'వీరబ్రహ్మ జై గోవిందమాంబ జై '.. అంటూ భక్తులు ముందుకు లాగారు. 'బ్రహ్మ' నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, ఒడిషా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాది జనం తరలివచ్చారు. రథంపై స్వామి, అమ్మవారి వైభవాన్ని కనులారా వీక్షించి ఆనంద భరితులయ్యారు. రథం పురవీధులలో తిరిగి యథా స్థానానికి చేరుకుంది. దాతలు విరివిగా అన్నదానాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ చేపట్టారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు.

**భారీ బందోబస్తు**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీనాథ్ రెడ్డి పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. జిల్లా నుంచి సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలతోపాటు 400 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు.

**దాతలకు సన్మానం**

బ్రహ్మరథ నిర్మాతలు వంకమర్రి వెంకటరెడ్డి, పునర్నిర్మాణ దాతలు బూదగిరికి చెందిన రాజగోపాలాచార్యులు, రథోత్సవ తాత్కాలిక ఉభయదాతలు కడపకు చెందిన మునగా బద్రినారాయణ, సునీత దంపతులు, అలంకరణ దాతలు కర్నూలుకు చెందిన రేవల్లి కన్నా సోదరులను ఘనంగా సన్మానించారు.

**ఆకట్టుకున్న గజవాహనోత్సవం**

రాత్రి నిర్వహించిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. అనంతరం మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి గజ వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపుగా చేరుకుని తిరిగి పెద్ద మఠం చేరుకుంది. సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు పాలేటమ్మ, సుబ్బిరెడ్డి, బాలహుసేన్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

## దైవదర్శనానికి వచ్చి.. భక్తుడు మృతి


కారు పైకి రావడంతో మృతి చెందిన ఇంద్రబాబు

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న అతడు.. రోడ్డు ప్రమాదంలో ఇంద్రబాబు(58) అశువులు బాశాడు. విజయవాడ ఆర్టీసీ వారి అన్నదాన సత్రం వద్ద పడుకున్న అతడిపై కారు వెళ్లడంతో శనివారం అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంద్రబాబు భార్య జయలక్ష్మి వివరాల మేరకు.. గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం మండలం పార్లపాడు గ్రామానికి చెందిన ఇంద్రబాబు, ఆయన సతీమణి విజయలక్ష్మి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు చూసేందుకు శుక్రవారం ఉదయం బి.మఠానికి వచ్చారు. రాత్రి దర్శనం చేసుకుని స్థానిక బద్వేల్ రోడ్డులోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న అన్నదాన సంత్రం వద్ద సేద తీరాలనుకున్నాడు. సత్రం వద్ద పడుకుని ఉండగా, హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ కారు ఆన్‌చేసి కిందకు దిగాడు. కారులో ఉన్న బాలుడు గేర్ వేయడంతో కారు ఇంద్రబాబు పైకి దూసుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య విజయలక్ష్మికి గాయాలయ్యాయి. బి.మఠం పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

## అదుపుతప్పి.. ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం


ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

ముద్దనూరు : స్థానిక ఘాట్ రోడ్డులోని ఎత్తులేటి కట్ట వద్ద నుంచి అదుపు తప్పి వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ భీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో జమ్మలమడుగుకు చెందిన లారీ డ్రైవర్ రాయల భాషా(37)దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. దాల్మియా సిమెంట్ కర్మాగారం నుంచి ఓ లారీ పుంగనూరుకు బయలుదేరింది. ముద్దనూరు ఘాట్ రోడ్డు మలుపులో లోతట్టు ప్రాంతానికి చేరగానే.. వేగం పుంజుకొని అదుపు తప్పి రైల్వే గేట్‌ను బలంగా ఢీకొనడంతో విరిగి ఎగిరిపడ్డాయి. అనంతరం అదే వేగంతో మసీదు వద్ద మలుపులోని ఓ ఇంటిలోకి దూసుకెళ్లడంతో పైకప్పు ధ్వంసమైంది. పెద్ద ఎత్తున నష్టపోయినట్లు ఇంటి యజమాని తెలిపారు. ప్రమాదంలో లారీలో చిక్కుకున్న డ్రైవర్ బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే గేట్‌ను ఢీకొనే సమయంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ వస్తోంది. అయితే కొద్ది నిమిషాల వ్యవధిలో పెను ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

### అగ్రిమెంట్ లీజ్ విషయంపై గొడవ

ఓబులవారిపల్లె : మంగంపేట స్నేహ మినరల్స్ కంకర క్రషర్ మిల్లు లీజు అగ్రిమెంట్ వివాదంలో జరిగిన గొడవపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్నేహ మినరల్స్ క్రషర్‌కు సంబంధించి తిరుపతికి చెందిన బాబ్జీ గునిపాటి రాయుడు వద్ద మూడు సంవత్సరాల కాలానికి లీజుకు తీసుకున్నాడు. ఇరువురి లావాదేవీలపై వ్యత్యాసం రావడంతో కొన్ని రోజులుగా వివాదం జరుగుతోంది. శనివారం గునిపాటి రాయుడు తన వర్గీయులతో కలిసి క్రషర్‌ను అడ్డుకున్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గునిపాటి రాయుడు, ఆయన డ్రైవర్ సుదర్శన్, లీజు దారుడు బాబ్జీ, ఆయన డ్రైవర్ భానుప్రకాష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

### కడప గౌస్ నగర్ ఘటనపై ఎస్పీ సీరియస్

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున రాత్రి 8 గంటల సమయంలో కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌస్ నగర్‌లో జరిగిన అల్లర్లపై జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ కఠిన చర్యలు చేపట్టారు. ఇరు వర్గాలకు చెందిన వారు రాళ్ల వర్షం కురిపించుకున్నా.. చర్యలు తీసుకునే విషయంలో అజాగ్రత్తగా ఉన్నారని.. కడప వన్‌టౌన్ సీఐ సి భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు తిరుపాల్‌నాయక్, ఎర్రన్న, మహమ్మద్‌రఫీ, ఆలీఖాన్, రంగస్వామిలకు ఛార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. కడప పోలీసు అధికారులతో శనివారం జరిగిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## భక్తి శ్రద్ధలతో చండీహోమం


వజ్రపు చీరలో వాసవీ మాత మూలవిరాట్


చండీ హోమం చేస్తున్న దృశ్యం

ఘనంగా వాసవీమాత జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం వాసవీమాత జయంతి ఘనంగా నిర్వహించారు. వేకువ జామున అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, బెంగళూరు నుంచి తెప్పించిన గజమాలలతో అలంకరించి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమం, చండీహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌ను వజ్రపు చీర, కిరీటంతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు లక్ష కుంకుమార్చన జరిపారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి

మదనపల్లె : వేసవి సెలవుల్లో తమ బంధువుల ఇంటికి పంపలేదని ఓ విద్యార్థి మనస్థాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. మండలంలోని బలకవారిపల్లె హరిజనవాడకు చెందిన ఓ మైనర్ బాలుడు(15) కురబలకోట చేనేత నగర్‌లోని గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల పాఠశాలకు సెలవులు ప్రకటించడంతో వాల్మీకిపురంలోని పిన్ని ఇంటికి పంపించమని తల్లిదండ్రులను కోరాడు. వారు వద్దని చెప్పడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దించి బాలుడిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



# అప్రమత్తతతోనే.. ప్రమాదాలకు చెక్



నిత్య జీవితంలో విద్యుత్తు ఎంతో అవసరం. వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాల బారిన పడాల్సిందేనని విద్యుత్తు అధికారులు హెచ్చరిస్తున్నారు. గంట కరెంట్ లేకపోతే ఊపిరాడదు... అయితే విద్యుత్తుతో ఎన్ని ప్రయోజనాలున్నాయో, జాగ్రత్తలు తీసుకోకపోతే అన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయని చెబుతున్నారు. ఈదురుగాలులతో వర్షాలు కురిసినపుడు ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు విద్యుత్తు శాఖ సిద్ధమవుతోంది.

- విద్యుత్తు ప్రమాదాలపై అవగాహనా సదస్సులు
- జాగ్రత్తలపై విద్యుత్తు శాఖ విస్తృత ప్రచారం
- ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు

కడప కార్పొరేషన్ : విద్యుత్తు ప్రమాదాలను నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీఎస్‌పీడీసీఎల్) నడుం బిగించింది. సంస్థలో పని చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది, వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని భావిస్తోంది. సబ్ స్టేషన్ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలు, రైతుల్లో చైతన్యం పెంచేందుకు చర్యలు చేపడుతోంది. వైఎస్సార్ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది.

**సిబ్బందికి సూచనలు**

వైఎస్సార్ జిల్లాలో 2022–23 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 41 విద్యుత్తు ప్రమాదాలు జరిగాయి. 2023–24లో 29 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కొందరు విద్యుత్తు ఉద్యోగులు ఐదు నిముషాల పనే కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సేఫ్టీ పరికరాలు వాడకపోవడంతో తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సిబ్బంది విధులు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు.

**ఈ సూచనలు పాటిస్తే మేలు**

- ఇళ్లలో అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్తు వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, ఇతర పరికరాలు ఐఎస్ఐ మార్కు కలిగినవే ఉండాలి.
- ఇంట్లో స్విచ్ బోర్డులను తగినంత ఎత్తులో అమర్చుకుని మోటార్ల స్విచ్‌లు(స్టార్టర్) ఆన్, ఆఫ్ చేసేటపుడు విధిగా కాళ్లకు, చేతులకు రబ్బరు తొడుగు ధరించాలి. తేమ లేకుండా చూసుకోవాలి.
- విద్యుత్ సర్వీసు వైర్ తగిన కెపాసిటీ ఉండేది వాడినట్లయితే సరఫరాలో అంతరాయం, ఓల్టేజీలో హెచ్చుతగ్గులను నివారించవచ్చు.
- ప్రతి ఇంటా విద్యుత్ సర్వీసుకు, పొలాల వద్ద అమర్చే స్టార్టర్లకు ఎర్తింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.
- వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు తాకరాదు. తడిచేతులతో, తడి కాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయరాదు.
- ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పుడు తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్లు, స్తంభాలున్నచో విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేసి నిబంధనల ప్రకారం దూరం పాటించాలి.
- బహిరంగ ప్రదేశాలు, పంట పొలాల్లో జంతువుల బారిన పడకుండా కట్టెలపై విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వడం చట్టారీత్యా నేరం.
- పొలాల్లో, ఇతర ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడి ఉంటే వెంటనే విద్యుత్ సిబ్బంది, 1912కు గానీ తెలియజేయాలి.
- గ్రామాలలో కొంతమంది విద్యుత్తును కొక్కెముల ద్వారా తీసుకుంటే అవి తెగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. స్తంభం నుంచి మాత్రమే కనెక్షన్ తీసుకోవాలి.
- విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, ఫీజులు వేయడం వంటి పనులు సొంతంగా నిర్వహించకుండా సిబ్బందికి తెలియజేయాలి.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనిస్తే ఆ వ్యక్తిని గానీ, విద్యుత్ పరికరాన్ని గానీ నేరుగా తాకరాదు. పరికరాలు మరమ్మతు చేసేటపుడు భద్రతా నియమాలు పాటించాలి.

**విద్యుత్తు ప్రమాదాలపై అవగాహన అవసరం**



ప్రమాదాల నివారణకు ప్రీ మాన్‌సూన్ తనిఖీలు నిర్వహిస్తాం. విద్యుత్తు ప్రమాదాలపై ప్రజలను నిరంతరం చైతన్య పరిచేందుకు అవగాహన కల్పిస్తున్నాం. పోల్ నుంచి వైర్‌ను స్టార్టర్‌కు తీసుకుపోవడంలో ఎక్కడా జాయింట్లు ఉండరాదు. కచ్చితంగా స్టార్టర్‌కు ఎర్తింగ్ చేసుకోవాలి. విద్యుత్తు సిబ్బంది ఎల్‌సీ తీసుకొని కరెంటు లేదని నిర్ధారించుకున్న తర్వాతే పనులు చేయాలి.

– ఎల్.నరసింహప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కడప డివిజన్, ఏపీఎస్‌పీడీసీఎల్

## రెండు దుకాణాల్లో చోరీ

పోరుమామిళ్ల : పట్టణంలోని ప్రధాన రహదారిలోని రెండు దుకాణాల్లో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడి దొరికింది దోచుకెళ్లారు. బాధితుల వివరాల మేరకు.. స్థానిక ప్రభుత్వ కళాశాలకు ఎదురుగా ఉన్న 'ఓంకార్ ఎలక్ట్రానిక్స్' షాపు షట్టర్ పైకి లేపి.. లోపలున్న దాదాపు రూ.90 వేల రూపాయల నగదు తీసుకెళ్లినట్లు యజమాని ఆర్.వెంకటసుబ్బయ్య తెలిపారు.

రెండో అంతస్తులోని సీసీ కెమెరా హార్డ్ డిస్క్ తీగలు కోసి తీసుకెళ్లారు. సంఘటన జరిగిన తీరు గమనిస్తే దొంగలు రెక్కీ నిర్వహించి ఈ చోరీ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దుకాణంలో టీవీలు, ఇతర విలువైన వస్తువులు పోలేదని, డబ్బు కోసమే చోరీ చేశారని బాధితుడు వెంకటసుబ్బయ్య వివరించారు. రహదారిపై సీసీ కెమెరాలను పరిశీలిస్తే ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు రికార్డయిందని తెలిపారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్కన ఉన్న 'ఫ్రెండ్స్ సూపర్ మార్కెట్' షట్టర్‌ను పైకి లేపి పెట్టెలోని రూ.7 వేల నగదు తీసుకున్నారు. దీంతోపాటు రెండు స్ప్రే బాటిల్లు, పిస్తా పాకెట్ తీసుకెళ్లారని, ఇతర వస్తువులు, సామగ్రి ఏవీ పోలేదని యజమాని దాదాపీర్ తెలిపారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ కట్ చేసి తీసుకెళ్లారు. బాధితులిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

కడప అర్బన్ : మోటార్ సైకిల్‌ను తప్పించబోయి అదుపు తప్పి కింద పడడంతో శేషం ఈశ్వర ప్రసాద్(12) మృతి చెందాడు. కడప నగర శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని ఆర్‌పీఎస్ నగర్‌లో నివాసముంటున్న శేషం వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు ఈశ్వర్ ప్రసాద్, సోదరుడితో కలిసి మోటార్ సైకిల్‌పై ఈ నెల 17న ఎర్రముక్కపల్లికి వచ్చారు. తిరిగి అదే వాహనంలో తిరిగి వస్తుండగా, పీఎఫ్ కార్యాలయం వద్ద మరో మోటార్ సైకిల్‌ను తప్పించబోయి వారి వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడిన బాలుడు, అతని తండ్రిని కడప రిమ్స్‌కు 108లో తరలించారు. చికిత్స పొందుతున్న బాలుడు ఈశ్వరప్రసాద్ మృతి చెందాడు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు.

### కడపలో విజిలెన్స్ దాడులు

కడప అర్బన్ : కడప నగరంలోని వీరాస్వామిమండి వీధి, రాంసా ఎలక్ట్రికల్ షాప్, గోడౌన్‌లలో ఈ నెల 17న, శనివారం విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్, పర్చేజ్ రిజిష్టర్ పరిశీలించారు. ఎమ్మార్పీ లేకుండా ఎలక్ట్రిక్ పరికరాలు ఉండడంతో రెండు కేసులు నమోదు చేసి, రూ.50 వేల జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు జి.ఈదురుబాషా, టి.రెడ్డెప్ప పాల్గొన్నారు.